అమ్మకు ప్రీతి.. ఆషాఢం

- శాస్త్రీయతల కలబోత బోనాల పండగ
- ఆషాఢ బోనాల సందర్భంగా ప్రత్యేక కథనం


బోనాలు (ఫైల్)

చాంద్రాయణగుట్ట: అమ్మల గన్న అమ్మ..మహంకాళమ్మకు ఆషాఢ మాసం ఎంతో ప్రీతి పాత్రమైంది. ప్రతి ఇంటి నుంచి ఆడ పడుచులు పసుపు, కుంకుమతో అలంకరించిన పాత్రలో అగ్ని సాక్షిగా నైవేద్యం(బోనం) సమర్పించడం అమ్మవారికి ఎంతో సంబురాన్ని కలిగిస్తోంది. గ్రామ పొలిమేరలలో ఉండే అమ్మవార్లకు ఈ మాసం మొత్తం భక్తులు బోనం సమర్పించడం అనాధిగా వస్తుంది. ఆది పరాశక్తిని మాఘ, చైత్ర, అశ్వయుజ, ఆషాఢ మాసాలలో పూజించాలని పురాణాలలో ఉంది. అందులో భాగంగానే తెలంగాణ ప్రాంతంలో సమస్త జగత్తుకూ మూలాధారమైన అమ్మవారిని బోనాల పేరుతో వైభవంగా పూజిస్తారు.


సంప్రదాయం.. శాస్త్రీయతల కలబోత..

విస్తారంగా కురిసే వర్షాలతో ఈ మాసంలో కలరా, మలేరియా లాంటి అంటువ్యాధులు చాలా త్వరగా వ్యాపిస్తుంటాయి. అంటువ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలు రాకుండా చూడాలని అమ్మవార్లను వేడుకొని భక్తులు బోనాలు సమర్పిస్తారు. ఈ బోనాల పండగలో ఆచారం, సంప్రదాయంతో పాటు శాస్త్రీయ కారణాలు కూడా ఉండడం మరో విశేషం. బోనాల సందర్భంగా మహిళలు కాళ్లకు రాసుకునే పసుపుతో వానాకాలంలో అరికాళ్ల చెడకుండా ఉంటాయి. దీంతో పాటు ఈ పండగకు అలంకారంగా ప్రతి ఇంటి గుమ్మాలకు, వీధి వీధికి వేపాకు మండలు కడుతారు. ఆ వేపాకులో ఉండే గుణం ద్వారా క్రిమీ కీటకాలు నాశనం అవడంతో పాటు అంటు వ్యాధులు కూడా దరిచేరవు.

మానవ జీవన విధానాన్ని ప్రతిబింబించేలా..

బోనం అలంకరణతో కూడా మానవ జీవన విధానాన్ని పోల్చుతారు. బోనాన్ని మూడు అంతస్తులుగా పేరుస్తారు. మొదటగా కుండలో ఉడకబెట్టిన అన్నం, బెల్లం, పెరుగు, వేపాకులు పెట్టి.. దానిపైన పులుసు (సాకనీరు).. దానిపైన వేపాకులు పెట్టి దీపం ఏర్పాటు చేస్తారు. కాగా బోనాన్ని మానవ శరీరంగా.. అన్నాన్ని ఆత్మ నైవేద్య ప్రసాదంగా.. బొట్టు మనిషికి ఉండే అలంకరణగా.. మధ్యలో ఏర్పాటు చేసే వేపాకులు మనిషి జీవితంలోని అనుభవాలకు ప్రతిరూపంగా కూడా భావిస్తారు.

భాగ్యనగరంలో శతాబ్దాలుగా బోనాల సంబురం..



భిన్న సంస్కృతుల మేళవింపుగా నిలిచిన భాగ్యనగరంలో బోనాల వేడుక శతాబ్దాలుగా ఘనంగా కొనసాగుతూ వస్తుంది. అమ్మవారిని ప్రసన్నం చేసుకునేందుకు నిర్వహించే ఈ ఆషాఢ బోనాల జాతర ఉత్సవాల్లో ఎన్నో విశిష్టతలు నెలకొని ఉన్నాయి. ఒక్కో ఘట్టంలో ఒక్కో విశ్వాసం ఉంటుంది. డప్పుల దరువులు, తప్పెట మోతలు, పోతరాజుల విన్యాసాలు, ఫలహారపు బండ్ల ఊరేగింపు, బంధువుల సందడి, బోనాల అలంకరణ, ఆడపడుచుల ఆనందం, సంప్రదాయ వస్త్రాధారణ, పోతరాజుల వీరంగాలు, శివసత్తుల చిందులు, యువకుల కోలాహలం.. ఇలా ఈ పండగకు ఉన్న ప్రత్యేకతలు అన్నీ ఇన్నీ కావు. మైకుల్లో మోగే జానపదాలు, ఆత్మీయుల పలకరింపులు ఈ ఉత్సవాల్లో ప్రస్ఫుటిస్తాయి.

అక్కలకు రక్షణగా తమ్ముడు పోతరాజు..

గ్రామ పొలిమేరలలో ఉండే మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ, డొక్కాలమ్మ, అంకాలమ్మ, పోలేరమ్మ, మారెమ్మ తదితర అక్కా చెల్లెళ్లను అంటుకునే తమ్ముడు పోతరాజు ఉంటాడు. అమ్మవారికి నైవేద్యం అర్పించేటప్పుడు దుష్ట శక్తులు రాకుండా పోతరాజు చేతిలో ఉన్న కొరడాతో తరముతూ మాతకు బోనం సమర్పించే వరకు రక్షకుడిగా ఉంటారు. ఈ తంతు ఎంతో పవిత్రంగా కొనసాగుతుంది. బోనాల రోజున స్త్రీలు తలస్నానం చేసి, పరిశుభ్రమైన వస్త్రాలు ధరించి, బోనం తయారు చేసి తలపై పెట్టుకొని వెళ్లి సమర్పిస్తారు. శక్తి స్వరూపిణైన మహంకాళికి భక్తి శ్రద్ధలతో భోజనాన్ని తాము మొక్కుకున్న రీతిలో సమర్పించుకోవడాన్నే బోనాలు అంటారు.

క్లుప్తంగా...

జాతీయ బాక్సింగ్ పోటీలకు తెలంగాణ జట్టు



గౌలిపురా: అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే జూనియర్ నేషనల్ బాక్సింగ్ పోటీలకు తెలంగాణ జట్టు జూలై 4న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరుతుందని అసిస్టెంట్ కోచ్ సత్యనారాయణ తెలిపారు. ఎల్‌బీ స్టేడియంలో చీఫ్ కోచ్ ఓంకార్‌నాథ్ యాదవ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విష్ణుశ్ యాదవ్, సోహన్ కుమార్ రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారన్నారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో జూలై 8 నుంచి 14వ తేదీ వరకు జరిగే జూనియర్ నేషనల్‌లో తెలంగాణ జట్టు పాల్గొననుందన్నారు.

ప్రత్యేక పూజలు



యాకుత్‌పురా: పురానీహవేలిలోని హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టులో న్యాయశాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించారు. కోర్టు ప్రాంగణంలోని అమ్మవారి ఆలయంలో సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుకా యారా అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర న్యాయశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.సుబ్బయ్య మాట్లాడుతూ.. ఆషాఢమాసం బోనాలను పురస్కరించుకొని ప్రతి ఏడాది అమ్మవారికి బోనాలు నిర్వహిస్తున్నామన్నారు.

సబ్జిమండిలో తొట్టెల ఊరేగింపు



గోల్కొండ: బోనాలు తెలంగాణ ప్రజల సంస్కృతీ సంప్రదాయాలకు, ఎల్లమ్మ తల్లి భక్తికి చిహ్నాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం గంగపుత్ర సంఘం సబ్జిమండి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ తొట్టెలతో పోతరాజుల విన్యాసాల మధ్య గోల్కొండ కోటకు బయలుదేరారు. సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి బోనం సమర్పించారు. కమిటీ వారు 49 ఏళ్లుగా గోల్కొండ ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆనందేశి విజయ్ కిషోర్, ప్రధాన కార్యదర్శి అంబటి విజయ్ ఆనంద్, గోల్కొండ కోట కమిటీ అధ్యక్షుడు అల్లె వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి గూడుమని చంద్రకాంత్, చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్, బీజేపీ నాయకులు దేవర వంశీ తదితరులున్నారు.

బీసీ ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి


బీసీ ఉద్యోగుల డైరీని ఆవిష్కరిస్తున్న బుర్రా వెంకటేశం తదితరులు

గన్‌ఫౌండ్రీ: బీసీ ఉద్యోగులు సమాజ హితం కోసం పనిచేయాలని బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం, నూతన డైరీ ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగులు ఐక్యంగా ఉండాలని సూచించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రతిభ అనేది ఎవరిసొత్తు కాదని పేర్కొన్నారు. చట్టసభల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని, బీసీ ఉద్యోగులకు క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. బాలాచారి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ గౌడ్, బీసీ సంఘాల నాయకులు కుల్కచర్ల శ్రీనివాస్, గణేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల ఉత్సవాలు

దూద్‌బౌలి: పాతబస్తీ చార్‌మహల్‌లోని తాటి మైసమ్మ ఆలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర రజక సంఘం చైర్మన్ కృష్ణమూర్తి, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ నర్సింహ, కమిటీ ఉపాధ్యక్షులు ధర్మ నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి షాపురం రవి, కోశాధికారి అందోల్ బాల్‌రాజ్, వీరమణి పాల్గొన్నారు.

సీఆర్‌పీసీ 41(ఏ)ను చట్టం నుంచి తొలగించాలి


ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న మహ్మద్ అసద్ అలీ, మహ్మద్ నిజాముద్దీన్

నాంపల్లి: సీఆర్‌పీసీ 41(ఏ) నోటీసును పోలీసులు దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, దీనిని చట్టం నుంచి తొలగించాలని న్యాయవాదులు మహ్మద్ అసద్ అలీ, మహ్మద్ నిజాముద్దీన్ రషీద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. జూనియర్ న్యాయవాదులకు ప్రతినెలా రూ.10 వేలు స్టయిఫండ్ ఇవ్వాలని కోరారు. రూ.2 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్‌ను రూ.5 లక్షలకు పెంచాలని, ఈ పథకాన్ని తల్లిదండ్రులకు కూడా వర్తింపజేయాలని, న్యాయవాదులకు నివాస స్థలాలు మంజూరు చేయాలని, వయోధిక న్యాయవాదులకు ప్రతి నెలా రూ.15 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. బీఎస్పీ అధికారంలోకి రాగానే న్యాయవాదులకు రక్షణ కల్పిస్తామని, పోలీసు శాఖలో సమూలమైన మార్పులు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ


నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్ శంకర్‌యాదవ్, అరుణజ్యోతి, చల్లా శ్రీనివాస్‌రెడ్డి

అబిడ్స్: మార్గదర్శిని స్వచ్ఛంద సంస్థ తరహాలో అందరూ సమాజ సేవా చేయాలని జీహెచ్‌ఎంసీ బీజేపీ ఫ్లోర్‌లీడర్ శంకర్‌యాదవ్ పేర్కొన్నారు. అబిడ్స్ కట్టెలమండిలోని ఆంధ్రవిద్యాలయ పాఠశాలలో మార్గదర్శిని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా పేద విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శంకర్‌యాదవ్ విద్యార్థులకు నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల కోసం స్వచ్ఛంద సంస్థలు చేయూతనందించాలన్నారు. మార్గదర్శి వ్యవస్థాపక అధ్యక్షురాలు అరుణజ్యోతి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు తమ మార్గదర్శిని ఆధ్వర్యంలో చేయూతనందిస్తున్నట్లు వివరించారు. హెచ్‌ఎం చల్లా శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు హేమ, మంజుల, సునిత, జ్యోతి, కవిత, ప్రియ పాల్గొన్నారు.

ఘనంగా గురు పూజోత్సవం

అబిడ్స్: భారతీయ యోగ్ సంస్థాన్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువులతోనే ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని బీవైఎస్ సభ్యులు పేర్కొన్నారు. భారతీయ యోగ్ సంస్థాన్ (బీవైఎస్) యోగా గురువులు సత్యనారాయణ, రాధ, లతను సత్కరించారు. యోగా సభ్యులు ఝాన్సీ, రాజు గుప్తా, స్వరూప, జయశ్రీ, కేతన్‌తో పాటు పలువురు సభ్యులు వారిని శాలువాతో సత్కరించి యోగా శిక్షకులుగా వారు చేస్తున్న కృషి కొనియాడారు. ఈ సందర్భంగా సత్యనారాయణ గురుజీ, రాధా, లత మాట్లాడుతూ.. ప్రతిరోజూ ప్రతి ఒక్కరూ కొంతసేపు అయినా యోగాసనాలు వేసి తమ ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవాలన్నారు.


యోగా గురువులు సత్యనారాయణ, రాధ, లతను సత్కరించిన బీవైఎస్ సభ్యులు

పర్యావరణంపై పబ్లిక్‌గార్డెన్స్‌లో వాకర్స్ ర్యాలీ


పబ్లిక్‌గార్డెన్స్‌లో చేపడుతున్న ర్యాలీ

నాంపల్లి: పబ్లిక్‌గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పర్యావరణంపై అవగాహన సదస్సు జరిగింది. సామాజిక కార్యకర్త మహ్మద్ అబిద్ అలీ నేతృత్వంలో సేవ్ పబ్లిక్‌గార్డెన్ పేరిట ఏర్పాటు చేసిన సదస్సుకు ముఖ్యఅతిథులుగా బీఎస్పీ నేతలు అబ్రార్ హుస్సేన్ ఆజాద్, అల్లోల రమేష్, నందకుమార్, అబ్దుల్ రహీం ఖాన్, భరత్, వినోద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పబ్లిక్‌గార్డెన్స్‌లో ర్యాలీని చేపట్టారు. అనంతరం గార్డెన్‌లోని పలు ప్రదేశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, పర్యావరణ ప్రేమికులు సర్వర్ పాషా, రయీస్ ఖాన్, ముజ్జాభాయ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్


పండ్లు, బిస్కెట్లు, టీషర్టులు పంపిణీ చేసిన వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రతినిధులు

అబిడ్స్: పేదలకు అండగా వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతుందని ఆ క్లబ్ మాజీ అధ్యక్షుడు కూర రఘువీర్, కన్వీనర్ అనంత నారాయణలు పేర్కొన్నారు. వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో పేద, వికలాంగులు, అనాథ పిల్లలకు టీషర్ట్‌లు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూర రఘువీర్, అనంత నారాయణలు మాట్లాడుతూ.. నగరంలో ఎన్నో సంవత్సరాలుగా వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. క్లబ్ అధ్యక్షుడు వరకుమార్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి మంచాల అంబరీష్, కోశాధికారి వెంకటేష్, ఇతర నాయకులు బాదం వెంకటకృష్ణ, బాశెట్టి హరినాథ్, వనపర్తి రమేష్, పద్మాల శంకర్, దేవత హన్మంతరావు పాల్గొన్నారు.

వైద్యులు సేవా దృక్పథంతో పని చేయాలి


డాక్టర్ అరుణ్‌కు పత్రాన్ని అందజేస్తున్న వేణుగోపాలాచారి

నాంపల్లి: వైద్యులు సేవా దృక్పథంతో పని చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. ఈ మేరకు శనివారం రాత్రి నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో మోర్ట్ ఫౌండేషన్, యోగా భారతి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వైద్య రంగంలో విశేషమైన సేవలు అందిస్తున్న డాక్టర్ అరుణ్ కుందవరంకు ఇంటర్నేషనల్ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు నమోదు పత్రాన్ని అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కేంద్ర సాహిత్య అకాడమి బాల సాహిత్య పురస్కార గ్రహీత చొక్కాపు వెంకటరమణ సభాధ్యక్షత వహించిన కార్యక్రమంలో జీనియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కో ఆర్డినేటర్ డాక్టర్ బింగి నరేందర్ గౌడ్, శోభన్‌బాబు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో ఇంటింటికీ బీజేపీ

అబిడ్స్: గోషామహల్‌లోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ బీజేపీ నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు నట్రాజ్‌నామ్‌దారి ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకుని ప్రధాని నరేంద్రమోదీ పథకాలు వివరించారు. కేరళ రాష్ట్రం నుంచి వచ్చిన విస్తారక్ సుష్మితబైజు బీజేపీ పథకాలను వివరించి బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహేష్‌సింగ్, కమల్‌సింగ్, విజయ్‌కుమార్, సురేష్ జోషి, శంకర్ యాదవ్, ఆనంద్‌యాదవ్, వీపీసీజీ తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటికీ బీజేపీలో నట్రాజ్‌నామ్‌దారి, సుష్మిత బైజు తదితరులు

మంత్రి కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

సుల్తాన్‌బజార్: మేరు కులస్తులను కించపరిచే వ్యాఖ్యలు చేసిన మంత్రి కేటీఆర్ క్షమాపణ చెప్పాలని తెలంగాణ మేరు సంఘాల ఐక్యవేదిక చైర్మన్ మునిగాల రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మేరు సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో హనుమాన్ టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాము మాట్లాడుతూ.. ఇటీవల వరంగల్ సభలో మేరుకులం సూది పోతే చెక్కర పంచాయితీ అని దేవుడిని మోసం చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందని చెప్పడం పట్ల మేరు కులస్తులను అవమానించే తీరుగా కేటీఆర్ మాట్లాడారని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న బీసీ కులాలందరినీ ఒకేథాటిపై తీసుకువచ్చి పోరాటం చేస్తామని హెచ్చరించారు. వెంకటరాజ్యం, విష్ణు, లింబాద్రి, పోల్కం శ్రీనివాస్, మహేష్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీజేపీ

గోల్కొండ: కార్యకర్తలకు బీజేపీ అండగా ఉంటుందని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గత వారం మెహిదీపట్నం జాన్‌దార్‌నగర్‌కు చెందిన బీజేపీ కార్యకర్త సర్వేష్‌గౌడ్ మృతి చెందారు. ఆదివారం బండారు దత్తాత్రేయ దివంగత సర్వేష్ గౌడ్ నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన సర్వేష్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.


పరామర్శిస్తున్న బండారు దత్తాత్రేయ

ప్రజలకు అందుబాటులో ఉండాలి


మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకిలోని తన కార్యాలయంలో కార్వాన్ నియోజకవర్గంలోని మజ్లిస్ ఏరియా కమిటీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరదనీటి పైప్‌లైన్ పనులు టోలిచౌకి, గోల్కొండ , నానల్‌నగర్, లంగర్‌హౌస్ డివిజన్‌లలో జరుగుతున్నాయని, వాటిని త్వరగా పూర్తి చేయిస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ నరుద్దీన్, మజ్లిస్ నాయకులు జుబేర్ బిన్ అవధ్, సయ్యద్ జబ్బార్, హబీబ్ చావూస్, టోలిచౌకి సదర్ ఖాజీ తదితరులున్నారు.

విద్యార్థులు పట్టుదలతో తమ లక్ష్యాన్ని చేరుకోవాలి


విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణ్

చార్మినార్: విద్యార్థులు పట్టుదలతో తమ లక్ష్యాన్ని చేరుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి ఎం.లక్ష్మణ్ సూచించారు. ఆదివారం హనుమాన్‌నగర్ ఫేజ్-3లోని సాయికృపా వసంత బంకెట్ హాల్‌లో పాతబస్తీ మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు నోట్ బుక్స్, నగదు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాల స్థాయి విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగిస్తే ఆశించిన ఫలితాలు సాధిస్తారన్నారు. అనంతరం ఓల్డ్ సిటీ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీరాములు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు లేని నిరుపేద విద్యార్థులకు స్కూల్ కిట్లను అందజేశామన్నారు. సంఘం ఉపాధ్యక్షులు ప్రభాకర్, శ్రావణ్, ప్రధాన కార్యదర్శి హన్స్‌రాజ్, కోశాధికారి నర్సింగ్‌రావు, కన్వీనర్ భానుమూర్తి పాల్గొన్నారు.

బోనం.. వెల్లివిరిసిన భక్తజనం

- భక్తిశ్రద్ధలతో జగదాంబిక అమ్మవారి 4వ బోనం పూజ
- భారీగా తరలివచ్చిన భక్తులు


కోటలో పర్యాటకులు

గోల్కొండ: గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి 4వ బోనం పూజ ఆదివారం జరిగింది. ఉదయం 5 గంటల నుంచే భక్తులు తమ వెంట వంట సామగ్రితో కోట మెయిన్ గేటు ముందు బారులు తీరారు. కాగా గతంలో ఎన్నడూ కూడా ఇంత పెద్ద సంఖ్యలో భక్తులు రాలేదని గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ చైర్మన్ ఎస్. రాజు వస్తాద్ అన్నారు. సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే ఆధ్వర్యంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు బందోబస్తును పర్యవేక్షించారు. గోల్కొండ కోట అధికారులు కూడా తమవంతు సహకారంగా పోలీసులకు సహకరించారు. భక్తులు గానీ, పర్యాటకులు గానీ కోట గోడలు ఎక్కకుండా కోట గోడ మెట్ల వద్ద భారీ ఇనుక బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచే మదీనా బాగ్ బ్యారెక్స్‌లో మహిళలతో అమ్మవారి ప్రసాదం తయారు చేసుకుంటూ బోనం కుండలను అలంకరించారు.

కోటలో ఆధ్యాత్మిక వాతావరణం..

లంగర్‌హౌస్, జియాగూడ, షేక్‌పేట్‌తో పాటు పాత బస్తీలోని వివిధ ప్రాంతాల నుంచి యువకులు పెద్ద ఎత్తున అమ్మవారి దర్శనానికి తరలి వచ్చారు. గోల్కొండ కోట ఫతే దర్వాజ నుంచి కోట చౌరస్తా వరకు అమ్మవారి భక్తి పాట పాడుతూ దర్శనానికి వెళ్లారు. అమ్మవారి భక్తి గీతాలు, శివసత్తు పూనకాలు, నాగదేవత పుట్ట వద్ద పూజలతో కోట మొత్తం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు శివసత్తులు, పోతరాజుల విన్యాసాలను ఎంతో ఆశ్చర్యంగా తిలకించారు. రంగారెడ్డి జిల్లా జడ్జి హర్షా, రంగారెడ్డి జిల్లా ఆర్‌డీఓ చంద్రకళ అమ్మవార్లను దర్శించుకున్నారు.

లంగర్‌హౌస్ నుంచి..

లంగర్‌హౌస్: గోల్కొండ జగదాంబిక అమ్మవారి నాల్గవ పూజ సందర్భంగా సామూహిక తొట్టెల ఊరేగింపు వైభవంగా జరిగాయి. వివిధ ప్రాంతాల ప్రముఖ ఆలయాల నుంచి కళాకారులు, డప్పువాయిద్యాలతో లంగర్‌హౌస్‌కు తొట్టెలు తరలివచ్చాయి. అక్కడ నుంచి సామూహికంగా తొట్టెల ఊరేగింపులు గోల్కొండ కోటకు తరలివెళ్లాయి. గోల్కొండ జగదాంబిక అమ్మవారికి ఆలయ కమిటీ చైర్మన్ జగదీష్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ అభిషేకాల్లో ఆలయ కమిటీ సభ్యుడు రాంకుమార్, దిలీప్ కుమార్, గరిషె శ్రీకాంత్, విజయలక్ష్మి పాల్గొన్నారు. స్వాగత వేదికల వద్ద పూజల్లో జీవన్ సింగ్, బీజేపీ నాయకులు అమర్ సింగ్, ఎంఐఎం మహిళా నాయకురాళ్లు మత్స రేణుక, శారద, సునంద నాయకులు అల్వాల శ్యాంరావు, గరిషె కార్తీక్, వసంత్‌రెడ్డి, కోయల్‌కర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


మహంకాళి అమ్మవారి పూజలు


బోనం సమర్పిస్తున్న రేణుక తదితరులు


హరిదాస్‌పుర నుంచి..